క్లుప్తంగా

ఆదాయం పెంచాలని సూచన



సిబ్బందికి జ్ఞాపికలందజేస్తున్న అప్పలనాయుడు

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ జోన్-1 డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు మంగళవారం దండుబజార్‌లోని కొత్త పార్శిల్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పరిస్థితులను ఆయన తెలుసుకున్నారు. పార్శిల్ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆదాయం పెంపునకు కృషి చేస్తున్న పార్శిల్ సెంటర్ సిబ్బందిని అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ డిపో మేనేజర్ సుధాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని దేవదాయ, ధర్మదాయ శాఖ శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో హుండీ ఆదాయాలను మంగళవారం లెక్కించారు. లాసెన్స్ బే కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో శ్రీనివాసరావు సమక్షంలో శ్రీవారి సేవకులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 75 రోజులకు రూ.6,25,352 ఆదాయం వచ్చినట్లు శ్రీ షిర్డీసాయిబాబా ఆలయ ఈవో శేఖర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వనజాక్షి, శివ తదితరులు పాల్గొన్నారు. నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. లాసెన్స్‌బే కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో బి. శ్రీనివాసరావు సమక్షంలో శ్రీహరి సేవకులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ఈవో శేఖర్‌బాబు మాట్లాడుతూ 75 రోజులకు రూ.1,57,000 ఆదాయం వచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో అర్చకులు రామారావు శర్మ, మహేష్, ఆర్. చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



మృతుడు అప్పారావు

సీతమ్మధార : రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవరు మృతి చెందిన ఘటన ఫోర్తుటౌన్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా..కైలాసపురానికి చెందిన గరికిన అప్పారావు (56) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని మంగళవారం రాత్రి 10.05 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న సమయంలో రైల్వేగేటు సమీపంలోని కాళికా మాత ఆలయం వద్ద కుక్క అడ్డురావడంతో సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. అప్పారావు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వాణిశ్రీ తెలిపారు.

ఓటు హక్కు ప్రాముఖ్యత తెలిపే చిత్రం ‘మార్టిన్ లూథర్ కింగ్’

సీతంపేట: ఓటు హక్కు ప్రాముఖ్యత తెలిపే చిత్రం ‘మార్టిన్ లూథర్ కింగ్’ అని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. నెలవారీ సినిమా ప్రదర్శనలో భాగంగా మంగళవారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మార్టిన్ లూథర్ కింగ్ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వెయ్యడం మన హక్కు అని, ప్రజలకు ఉన్న అతిపెద్ద ఆస్తి అని అన్నారు. 18 ఏళ్లు దాటిన వారందరూ తప్పని సరిగా ఓటు వెయ్యాలన్న అంశంతో రూపొందించిన చిత్రమని, అందరూ చూడదగినదని అన్నారు. ఈ చిత్రంలో నటించిన నగర కళాకారులు ఇమంది ఈశ్వరరావు, కేసీహెచ్.గోపినాయుడు, మల్లికలను ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమీక్షా కార్యక్రమంలో బి.చిన్నారావు, ఉషారాణి, కృష్ణారావు, కాశీవిశ్వేశ్వరరావు, సుధాకర్, ప్రభ, చాటల బాబూరావు రెడ్డి పాల్గొన్నారు.



వాసుపల్లి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకుంటున్న బోట్ ఓనర్లు



వైఎస్సార్‌సీపీలో చేరిన 33వ వార్డు మహిళలు



వాసుపల్లిని అభినందిస్తున్న మత్స్యకారులు, కలాసీలు

సేవాస్ఫూర్తికి.. అభిమాన హారతి

- వాసుపల్లికి వెల్లువెత్తుతున్న మద్దతు
- మెజారిటీ అందించి మంత్రిగా చూసుకుంటామంటున్న బోట్ యజమానులు, కలాసీలు
- మద్దతు పలికిన మత్స్యకారులు
- వైఎస్సార్‌సీపీలో చేరిన 33వ వార్డు మహిళలు



వాసుపల్లిని సత్కరిస్తున్న జనతాబజార్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు



కండువా కప్పి మహిళల్ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ప్రజాభిమానం వెల్లువెత్తుతోంది. బోటు యజమానులు, కలాసీలు మంత్రిని చేసి మెజారిటీ అందిస్తామని హామీ ఇవ్వగా, మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వాసుపల్లిని గెలిపించుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని చెబుతూ పలువురు మత్స్యకారులు వాసుపల్లి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. 33వ వార్డులో వంద మంది మహిళలు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకుని వాసుపల్లిపై గల అభిమానం చాటుకున్నారు.

మెజారిటీ అందించి.. మంత్రిగా చూసుకుంటాం..

పేదలంటే ప్రేమ పంచే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు హ్యాట్రిక్ విజయం అందిస్తామని, మెజారిటీ అందించి, మంత్రిగా చూసుకుంటామని ఫిషింగ్ హార్బర్ బోట్ ఓనర్స్ ముక్తకంఠంతో మద్దతు తెలిపారు. ఆశీల్‌మెట్ట సమీపాన వాసుపల్లి కార్యాలయంలో మంగళవారం బోట్ ఓనర్ల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మందికి పైగా బోట్ ఓనర్స్ వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వాసుపల్లి పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా బోట్ ఓనర్స్ మాట్లాడుతూ మత్స్యకారులకు 50 ఏళ్లకే పెన్షన్ అందజేయాలని అసెంబ్లీలో మాట్లాడి సాధించిన ఘనత వాసుపల్లికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన బోట్ల దగ్ధంపై మంటలు ఆరక ముందే నష్టపరిహారం అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. వాసుపల్లి వారంలో నాలుగు సార్లు ప్రజాదర్బార్ నిర్వహిస్తూ నిత్యం ప్రజల కష్టాల్లో తోడుగా సొంత నిధులతో సేవలందిస్తున్నారని కొనియాడారు. పేదల పెన్నిధి వాసుపల్లి గెలుపునకు పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫిషింగ్ హార్బర్ బోట్ ఓనర్స్ చెన్నా అప్పారావు, వాసుపల్లి ఎల్లారావు, గంటా దాసు, దౌలపల్లి దాసు, కుంజు మాన్, బొడ్డు ఆనంద్, కె. అప్పన్న, అల్లిపిల్లి చిన్నారావు, మేడ ఎల్లయ్య, మైలపిల్లి చిన్న ఎర్రన్న, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏ కష్టమొచ్చినా మీతోనే ఉంటా..

ఇప్పటి వరకు ఏ కష్టం వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉన్నానని, ఇకపై కూడా అండగా ఉంటానని వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిరపల్లి రాము, ముత్తా బత్తుల రమేష్ ఆధ్వర్యంలో వంద మంది మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ పేదల పార్టీ వైఎస్సార్‌సీపీలో అందరూ ఆనందంగా ఉండడమే జగనన్న లక్ష్యమన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీని బలపరచాలని అభ్యర్థించారు. మహిళలు పెద్ద ఎత్తున జై జగన్.. జై వాసుపల్లి అంటూ నినాదాలు చేశారు.

వాసుపల్లికి జనతాబజార్ వ్యాపారుల మద్దతు..

జగదాంబ : దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించుకుంటామని జనతాబజార్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు తెలిపారు. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డు మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న స్క్రాప్ వ్యాపారులు వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లిని సత్కరించి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి ఎంతో మందికి ఆయన సేవలందించారని కొనియాడారు. పేదలు పిలవగానే పలికే ఆయనకే తమ ఓటు అన్నారు. వాసుపల్లి సేవలు ఆదర్శనీయమన్నారు. 72 మంది స్క్రాప్ వ్యాపారులతో పాటు దుకాణాల్లో పని చేస్తున్న వారంతా ఓటు వేస్తామని ఈ సందర్భంగా గణేష్‌కుమార్‌కు హామీ ఇచ్చారు. వాసుపల్లి మాట్లాడుతూ బుధవారం పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయం నుంచి ప్రారంభమయ్యే ప్రచార కార్యక్రమానికి స్క్రాప్ వ్యాపారులందరూ హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదివిష్ణురెడ్డి, సుబ్రహ్మణ్యం, గంగాధర్, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : గర్భిణులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా ట్రైనింగ్ టీం ఆధ్వర్యంలో దక్షత శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. 3 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి గర్భవతి 12 వారాలలోపు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ), పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (యూపీహెచ్‌సీ)ల్లో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. దీని కోసం పారా మెడికల్ సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. మాతా-శిశు మరణాలు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి సేవలందించాలన్నారు. అవసరం అయితే వీరిని రిఫరల్ ఆస్పత్రులకు పంపి సేవలందిస్తామన్నారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ సమత, డాక్టర్ షర్మిల, ఐ.మనోరమ, కె.ధర్మేంద్ర, నాగభూషణం, స్టాఫ్‌నర్స్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్‌లో ప్రాంగణ ఎంపికలు

డాబాగార్డెన్స్ : ఏవీఎన్ కళాశాలలో మంగళవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. అక్షిత శ్రీ ఆగ్రో ప్రైవేట్ కంపెనీ, అక్షితశ్రీ ఆటోటెక్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో వంద మందికి పైగా ఏవీఎన్ విద్యార్థులు పాల్గొనగా 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి నియామక పత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పి. కృష్ణకుమారి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డి. సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్లు శ్రావణి, శారద ఇంటర్వ్యూలు నిర్వహించారు.

‘సీ-విజిల్’ ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం





సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్, తూర్పు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కె.మయూర్ అశోక్

మహారాణిపేట: ఎన్నికల కమిషన్ రూపొందించిన సీ-విజిల్ యాప్‌లో నమోదైన ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్, తూర్పు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కె.మయూర్ అశోక్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌వో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, డ్రగ్స్ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలో కేసులు నమోదు అయ్యేలా చూడాలని కోరారు. దీనికి ఎన్‌ఫోర్సుమెంటు టీంలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రాబోయే రోజుల్లో సీజర్స్ కేసులు ఎక్కువగా నమోదు అయ్యేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనుమతులు లేని సమావేశాలు, లౌడ్‌స్పీకరు వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్, సి-విజిల్ ఎన్‌ఫోర్సుమెంటు బృందాలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

30న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 30న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

కంప్యూటర్ వితరణ



సిటు కార్యాలయానికి కంప్యూటర్ అందజేస్తున్న వెంకట్రావు తదితరులు

డాబాగార్డెన్స్ : సిటు విశాఖ జిల్లా కార్యాలయానికి స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి, మాధవధార వాసి కూన వెంకట్రావు రూ.40 వేల విలువ చేసే కంప్యూటర్‌ను బహూకరించారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం, జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాసరావుకు కూన వెంకట్రావు, ఆయన భార్య జనార్దనమ్మ, కుమార్తె మృదులతో కలిసి కంప్యూటర్ అందజేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కూన వెంకట్రావు కార్మికుల సమస్యలపై పని చేశారని, ఆయన కుమారుడు అవినాష్ పేరిట అవినాష్ సేవా ఫౌండేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.

టీడీపీ మాజీ మహిళా అధ్యక్షురాలికి వాసుపల్లి పరామర్శ



అన్నంరెడ్డి వాణిని పరామర్శిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : పార్టీలకు అతీతంగా కష్టమంటే పలకరించే వాసుపల్లి గణేష్‌కుమార్ తన ప్రత్యర్థి పార్టీకి చెందిన మాజీ మహిళా అధ్యక్షురాలు అన్నంరెడ్డి వాణిని పరామర్శించారు. ఏఎస్ బీచ్ ఆస్పత్రిలో డయాలసిస్ సమస్యతో బాధపడుతున్నట్టు తెలుసుకున్న వాసుపల్లి మంగళవారం ఆమెను పరామర్శించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్‌ను ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మీరు తెలుగుదేశం పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా డైనమిక్ మహిళా నేతగా సేవలందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తనని పరామర్శించిన వాసుపల్లికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబానికి ఆసరాగా ఉపాధి కోర్సులు



మహిళలు తయారు చేసిన కొవ్వొత్తులు చూపుతున్న నరవ ప్రకాశరావు

డాబాగార్డెన్స్ : కుటుంబానికి ఆసరాగా ఉపాధి కోర్సులు అందిస్తున్నట్టు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. బీచ్‌రోడ్డులోని బాల వికాస్ ఫౌండేషన్ బ్రిడ్జి స్కూల్ ఆవరణలో మహిళలకు ఉచిత కొవ్వొత్తుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. మహిళలు తీరిక సమయంలో స్వయం ఉపాధి కోర్సులపై దృష్టి సారించి కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నారు. జన శిక్షణ సంస్థాన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 32 మంది మహిళలు పాల్గొన్నారు. ట్రైనర్ రమణికుమారి, జన శిక్షణ సంస్థాన్ సభ్యులు మనోహర్, మహాలక్ష్మి, శ్రీదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగ్‌తో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయితో ఉన్న బ్యాగ్‌ను విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం... డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు(డీఎస్ఆర్పీ), బి మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ జి. శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎఎస్‌ఐ అనంతరావులు తమ తమ సిబ్బందితో మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫారాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో అజ్ఞాత వ్యక్తి ఓ బ్యాగును విడిచిపెట్టి వెళ్లిపోయాడు. ఈ బ్యాగును తనిఖీ చేయగా ఇందులో సుమారు రూ.40వేలు విలువ 8 కేజీల గంజాయిని గుర్తించారు. బ్యాగ్‌ను సీజ్ చేసినట్లు జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా పైడిమాంబ జాతర



గజమాల అలంకరణలో పైడిమాంబ అమ్మవారు



ఆలయం ఆవరణలో వేపచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: ఓల్డ్ డెయిరీ ఫారం జంక్షన్‌లో పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన వేల మంది భక్తులతో ఈ ప్రాంతం సందడిగా మారింది. ఈ ఉత్సవాలు ఈ నెల 18న ప్రారంభమైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రోజూ ఇక్కడ అమ్మవారికి భక్తులు పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అమ్మవారి నవరాత్రి మహోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు. అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేశారు. మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ ఆవరణలో ఉన్న పురాతన వేపచెట్టుకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీరు, ప్రసాదం అందజేశారు. తోపులాటలు జరగకుండా క్యూల వద్ద పోలీసులు బందోబస్తుతో పాటు కమిటీ పెద్దలు, స్థానిక యువకులు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గాంధీనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్ నుంచి డెయిరీ ఫారం, ఇందిరానగర్ వరకు 14 గ్రామాలతో పాటు ఆరిలోవ, విశాలాక్షినగర్, హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల నుంచి వేల మంది భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి.

అమ్మవారి సన్నిధిలో ఎంపీ ఎంవీవీ

పైడిమాంబ అమ్మవారిని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు దర్శించుకున్నారు. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రసాదం వితరణ

రవీంద్రనగర్ నుంచి డెయిరీఫారం వరకు స్థానిక యువత, వివిధ సంఘాల నిర్వాహకులు రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు మజ్జిగ, పులిహోర, చక్కెర పొంగలి, బెల్లం నీరు (తీర్థం), ప్రసాదం, మంచినీటి ప్యాకెట్లు వంపిణీ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తప్పెటగుళ్లు, పులివేషాలు తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డప్పులు, వాయిద్యాల నడుమ రవీంద్రనగర్ ఆఖరి బస్‌స్టాప్ వద్ద ప్రారంభమైన సంబరాలు ఎస్‌ఐజీ నగర్, వివేకానందనగర్, సుందర్‌నగర్, ఆదర్శనగర్ మీదుగా డెయిరీఫారం వద్ద అమ్మవారి గుడి వరకు సాగాయి. సాయంత్రం జరిగిన పరసలో స్టాళ్ల వద్ద ప్రజల రద్దీ కనిపించింది. భక్తుల రద్దీని నియంత్రించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆరిలోవ సీఐ గోవిందరావు, ఎస్‌ఐలతో పాటు సుమారు 50 మంది సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు ఇక్కడ బందోబస్తు నిర్వహించారు.

‘కేజ్రీవాల్ అరెస్ట్ అప్రజాస్వామికం’



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

మహారాణిపేట : ఆమ్ ఆద్మీ పార్టీ విశాఖ నాయకుడు మిక్కిలి రవి భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం అల్లిపురం సీపీఐ ఆఫీసులో ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టుపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శీర రమేష్ కుమార్ మాట్లాడుతూ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చెయ్యగలరు కానీ అతని సిద్ధాంతాలను మార్చలేరన్నారు. మహిళా అధ్యక్షురాలు డాక్టర్ షీతల్ మదాన్ మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా డబ్బుల వ్యవహారం బయటికి రావడంతో ఈ కేసు నుంచి జనాలను తప్పు తోవ పట్టించడానికి ఇలా చేశారని అన్నారు. సీపీఐ నాయకుడు పైడిరాజు మాట్లాడుతూ కేజ్రీవాల్ అరెస్ట్ అప్రజాస్వామికం అన్నారు. కార్యక్రమంలో మైబీ కేజ్రీవాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రియాంక, ప్రముఖ ప్రజా నాయకురాలు సీతామహాలక్ష్మి, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరదరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ పైల రమేష్ రాజు, జిల్లా కార్యదర్శి రామ సంతోష్, నిమ్మకాయల భాస్కర్, కె.ఎం. రాజు, కృష్ణభగవాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థుల ప్రతిభ

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు చిత్రలేఖనంలో పతకాలు సాధించారు. డ్రీమ్ హార్ట్ సంస్థ విజయవాడలో 11వ ఆలిండియా చిల్డ్రన్ అండ్ యూత్ ఆర్ట్ కాంపిటేషన్ కం ఎగ్జిబిషన్ ఇటీవల నిర్వహించింది. ఈ పోటీలకు శ్రీకృష్ణాపురం గురుకులానికి చెందిన ఆరు నుంచి 9వ తరగతి వరకు 50 మంది విద్యార్థులు చక్కటి చిత్రాలు గీసి ఆన్‌లైన్‌లో నిర్వాహకులకు పంపించగా.. 15 బంగారు, 15 వెండి పతకాలు వచ్చినట్లు గురుకులం డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పిడమర్తి సుధాకర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఇటీవల గురుకులాన్ని సందర్శించిన సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్, గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి అభినందించారు.

ప్రత్యంగిరా దేవికి అభిషేకం



లలితాపీఠంలో ప్రత్యంగిరాదేవి అభిషేకంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో మంగళవారం సాయంత్రం రాహుకాల సమయంలో శ్రీప్రత్యంగిరా అమ్మవారికి విశేష అభిషేకం చేశారు. అర్చకుల వేదమంత్రాల మధ్య అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం అర్చన గావించి, అమ్మవారి విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించారు. ప్రత్యంగిరా దేవిని పూజించడం వల్ల శత్రునాశనం, కోర్టు కేసుల్లో విజయం, ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని అర్చకులు తెలిపారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.